ఓల్డ్ ఎంఐజీ నుంచి కేటీఆర్ రోడ్‌షోకి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కేటీఆర్ రోడ్‌షోకు బీఆర్ఎస్ శ్రేణులు

రామచంద్రాపురం, మే 6: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్‌లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో రోడ్‌షోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అత్యధిక సీట్లలో బీఆర్ఎస్‌ని గెలిపించబోతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. కేసీఆర్ ఉంటేనే బాగుండేదని ప్రజలు ఇప్పుడు భావిస్తున్నారన్నారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన సమ్మర్ క్యాంప్

బొల్లారం, మే 6: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఐవీ ఎయిడ్స్ బాధిత చిన్నారుల సంరక్షణ కేంద్రం డిసైర్ సొసైటీలో రెండు రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి సీఐ గంగాధర్ హాజరై చిన్నారులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 14 ఏండ్లుగా ఎయిడ్స్ బారిన పడిన చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతున్న ఫౌండర్ రవిబాబును అభినందించారు. అనంతరం రవిబాబు.. సమ్మర్ క్యాంపును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు చిన్నారులకు మ్యాజిక్ షో, టాకింగ్ డాల్ కిట్స్ కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఐటీ ఉద్యోగులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కిరణ్, ఐటీ ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.

చిన్నారులకు న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్న సీఐ గంగాధర్

కంకర క్రషర్‌పై చర్యలు తీసుకోవాలి

హత్నూర, మే 6: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కంకర క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని హత్నూర గ్రామస్తులు సోమవారం సంగారెడ్డి మైనింగ్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని గణపతి కంకర క్రషర్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బండరాళ్లను తవ్వుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం కేటాయించిన భూమికి మించి తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిపారు. బండరాళ్లను పేల్చే సమయంలో ఇండ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. అధిక లోడుతో కంకర, డస్ట్ టిప్పర్లు వెళ్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్, గ్రామస్తులు పెంటేశ్, ఆంజనేయులు, రాములు, పెంటయ్య, కృష్ణ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో రోగులకు మేలు

కోహీర్, మే 6: దవాఖానకు వచ్చే రోగుల సమయం వృథా కాకుండా ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానలో ఆర్ఎంవో నాగరాజ్ పాటిల్‌తో కలిసి ఆయన క్యూ ఆర్ కోడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సహాయ ఇంజినీర్ సంచాలకులు శృతి మాట్లాడుతూ చికిత్స కోసం దవాఖానకు వచ్చిన రోగులు ఇకమీదట వరుస క్రమంలో వేచి చూడాల్సిన అవసరం లేదన్నారు. దీని ద్వారా చికిత్స కోసం ఏ వైద్యుడి గదికి వెళ్లాలో సులభంగా తెలుస్తుందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా

చౌటకూర్, మే 6: మండల కేంద్రం చౌటకూర్‌తో పాటు శివంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ సంజీవరావు సోమవారం సందర్శించారు. ఈ నెల 13వ తేదీన జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అందోలు-జోగిపేట ఆర్డీవో పాండుతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బందికి తాగునీరు, విద్యుత్, ఇతర వసతులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్, తహసీల్దార్ ఈశ్వరీ రాణి తదితరులున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన

కోహీర్, మే 6: జహీరాబాద్ పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల వినియోగంపై శిక్షణ కలెక్టర్ మనోజ్ సోమవారం పరిశీలించారు. ఉద్యోగుల సంఖ్య, పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల నిర్వహణ కేంద్రాల సంఖ్య గురించి ఆర్డీవో రాజును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బొల్లారం, మే 6: మున్సిపాలిటీ పరిధిలోని మీదికుంటలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ రెండో వార్డ్ కౌన్సిలర్ గోపాలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సాయిబాబా ఆలయం వెనుక భాగంలోని మీదికుంటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆమె పరిశీలించారు. రెండు రోజులుగా మళ్లీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్తించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, మే 6: బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని 19వ, 11వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ అమలు చేసిన పథకాలను పొందిన ప్రతిఒక్కరూ తెలంగాణ ఉద్యమ కారుడైన గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అమలు చేస్తామంటున్న గ్యారెంటీలను తెలంగాణ ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. పింఛన్ నెలకు రూ.4వేలు, మహిళలకు నెలనెలా రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4వేలు, రుణమాఫీ రూ.2లక్షలు, కౌలు రైతులకు రూ.12వేలు, కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఏ ఒక్కరికైనా వచ్చిందా అని ప్రశ్నించారు. జహీరాబాద్ అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ గెలుపుతోనే సాధ్యమవుతుందన్నారు. గాలి అనిల్ కుమార్ గెలిస్తే వచ్చే ఎంపీ నిధులతోపాటు తన ఎమ్మెల్యే నిధులతో కలిపి జహీరాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకొనే అవకాశం లభిస్తుందన్నారు. నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలని విన్నవించారు. ప్రచారంలో తంజీమ్, అబ్దుల్లా, యాకూబ్, మొహియొద్దీన్, బండి మోహన్, శ్రీనివాస్, తులసీదాస్ గుప్తా, విశ్వేశ్వర్, ప్రభు, వెంకట్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

తాగునీటి సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, మే 6: సంగారెడ్డి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు తెలంగాణలో ఏ ఒక్క పూట కూడా తాగు నీటి సమస్య తలెత్తలేదని, ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ పెట్టి సింగూరు నుంచి మంచినీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైందని, మూడు రోజులుగా సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలు, గ్రామాల ప్రజలు మంచినీళ్లు లేక దాహార్తితో అలమటిస్తున్నారన్నారు. మిషన్ భగీరథ ద్వారా సింగూరుకు వచ్చిన నీటిని రాకుండా చేస్తున్నారని, నీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమన్నారు. నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని అధికారులను అడిగినా స్పందన లేదన్నారు. తాగు నీటి సరఫరా కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలలోపు నియోజకవర్గంలో తాగు నీటి సరఫరా సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌లోకి కొడకంచి మాజీ సర్పంచ్

శ్రీశైలంను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 6: బీఆర్ఎస్‌లోకి కొడకంచి మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు శ్రీశైలం చేరారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జిన్నారం మండలం కొడకంచి మాజీ సర్పంచ్ శ్రీశైలంను గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం చేరికతో జిన్నారం మండలంలో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరిందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపుకోసం బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయన్నారు. పార్టీలో పనిచేస్తున్న వ్యక్తులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిపై అసత్య ప్రచారాన్ని అడ్డుకోండి

పటాన్‌చెరు, మే 6: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై అసత్యపు వీడియోలు తయారు చేసి దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డికి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఫిర్యాదు చేశారు. సోమవారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారీలతో కలిసి సీఐకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఐఏఎస్ మాజీ అధికారి వెంకట్రామిరెడ్డిపై సోషల్ మీడియాలో బురదజల్లే వీడియో వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక కొన్ని పార్టీలు అసత్య ప్రచారాలకు తెగబడ్డాయని ఆరోపించారు. వారం రోజుల్లో ఎంపీ ఎన్నికలు ఉన్నాయని, ఈ సమయంలో వెంకట్రామిరెడ్డి ప్రతిష్టను దెబ్బతీసే కుట్రతో కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారంతో కూడిన వీడియోలు తీసి వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పలు ఎన్నికల సర్వేల్లో వెంకట్రామిరెడ్డి విజయం ఖాయమైందని తేలిందన్నారు. ఇది జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డిని అప్రతిష్టపాలు చేసి ఓడించాలనే కుట్ర వీడియోల్లో దాగుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియోల వెనకాల ఉన్నది ఎంతటి శక్తులైనా పోలీసు యంత్రాంగం వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు.

పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్సే..

రుద్రారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 6: లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ చెబుతున్న మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని, ప్రజల పక్షాన నిలిచి పోరాడే బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని రుద్రారం, పగిడిపల్లి, అంత్వార్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంత చెబుతున్న బీజేపీ అయోధ్య రామాలయ నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయించే సత్తా కేవలం బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందన్నారు కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రవీందర్‌నాయక్, ప్రభాకర్, నవాబ్, సత్యపాల్‌రెడ్డి, సాల్మన్, రాంగౌండ, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 6: డిగ్రీ పూర్తి చేసుకునే విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలని అశోకా స్కూల్ ఆఫ్ బిజినెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్ పెర్షద్ సూచించారు. హైదరాబాద్‌లోని అశోకా స్కూల్ ఆఫ్ బిజినెస్, తారా ప్రభుత్వ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ అనే అంశంపై ఒక రోజు స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన బీకాం చదివిన విద్యార్థులు ఎంబీఏ ఎంచుకోవాలని, ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, అధ్యాపకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశం, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి సంతోషి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏవీ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

కోహీర్, మే 6: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ అన్నారు. సోమవారం జహీరాబాద్‌లో సీపీఎం, సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గెలుపు కోసం కమ్యూనిస్ట్ నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చుక్క రాములు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, బీరం మల్లేశం, రాంచందర్, మహిపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

రామచంద్రాపురం, మే 6: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సూచించారు. సోమవారం ఆర్సీపురం డివిజన్‌లోని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ నివాసానికి దీపాదాస్ మున్షీ వచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా అక్కడికి వచ్చారు. మెదక్ లోక్‌సభ స్థానంలో ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. అభ్యర్థి విజయం కోసం నాయకులకు దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

న్యాల్‌కల్, మే 6: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), న్యామతాబాద్ గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌ల మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, హద్నూర్, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్‌లు జాగన్నారెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి, ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసొద్దీన్, నాయకులు చంద్రప్ప, సామేల్, విశ్వనాథ్, రఫీయొద్దీన్, సమీయొద్దీన్, తుక్కన్న, పూర్ణచందర్, అప్పారావుపాటిల్, రంజీత్, రాములు పాల్గొన్నారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

హత్నూర, మే 6: కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం హత్నూర మండలంలోని పలుగ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దూసుకుపోతున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంజనేయులు, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నీటి గుంతలో పడి యువకుడి మృతి

ఎలబంటి వినోద్‌కుమార్(ఫైల్)

కోహీర్, మే 6: సరదా కోసం ఈతకు వెళ్లిన ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన కోహీర్ మండలంలోని కొత్తూర్(డి) గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణయ్య కథనం ప్రకారం.. కొత్తూర్(డి) గ్రామానికి చెందిన ఎలబంటి వినోద్ కుమార్(22) తన స్నేహితులతో కలిసి వాక్సన్ యూనివర్సిటీలో పని చేసేవాడు. ఆదివారం పలు గ్రామాలకు చెందిన ఐదుగురు స్నేహితులు కలిసి గ్రామ శివారులోని మైనింగ్ క్వారీ సమీపంలో విందు చేసుకొన్నారు. మధ్యాహ్నం కావడంతో ఎండ వేడిమి నుంచి సేదతీరేందుకు ఇద్దరు పెద్ద నీటి గుంతలో దిగారు. ఎలబంటి వినోద్‌కుమార్‌తోపాటు ఎలబంటి మధు ఈత కొట్టేందుకు ప్రయత్నించారు. కానీ, వారికి ఈత రాకపోవడంతో ముందుగా నీటిలో మునుగుతున్న మధును పైన ఉన్న ముగ్గురు స్నేహితులు కాపాడారు. కానీ, అంతలోనే ప్రమాదవశాత్తు వినోద్‌కుమార్ నీటిలో మునిగిపోయాడు. గజ ఈత గాళ్లతో వెతికించారు. చివరకు 24గంటల తర్వాత మృత దేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. తండ్రి శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చినిగేపల్లిలో యువతి అదృశ్యం

న్యాల్‌కల్, మే 6: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చినిగేపల్లిలో చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం.. మండలంలోని చినిగేపల్లి గ్రామానికి చెందిన కొటారి నర్సప్ప కూతురు భాగ్య(28) ఈ నెల 4న రాత్రి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె ఎంతకూ తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారి దగ్గర ఆచూకీ లభించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోకెమ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

జిన్నారం, మే 6: గడ్డపోతారం మెట్రోకెమ్ పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున రియాక్టర్ వద్ద అగ్ని ప్రమాదం జరగడంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగినట్లుగా కార్మికులు తెలిపారు. అప్రమత్తమైన సిబ్బంది మంటలను వెంటనే అదుపులోకి తీసుకొచ్చారు.

గడపగడపకూ గులాబీ సేన

బీఆర్ఎస్ ప్రచారానికి ఓటర్ల నుంచి విశేష స్పందన వస్తున్నది. బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో మునిగితేలుతున్నారు. ప్రచారానికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో సోమవారం ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, మే 6

కంది: కందిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రామచంద్రాపురం: ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

జిన్నారం: ప్రచారం చేస్తున్న జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్

గుమ్మడిదల: వీరారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

అమీన్‌పూర్: ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు



అందోల్: జోగిపేటలో బీఆర్ఎస్ ప్రచారం

సదాశివపేట: మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ఆధ్వర్యంలో..

బొల్లారం: బీఆర్ఎస్ నాయకులకు మంగళహారతి